## క్లుప్తంగా

### మాజీ ఎంపీ జయంతి



వెంకటస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం 15వ ప్రత్యేక పోలీసు బెటాలియన్‌లో ఆదివారం మాజీ ఎంపీ గడ్డం వెంకటస్వామి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద బెటాలియన్ అదనపు కమాండెంట్ ఏ.అంజయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీగా వెంకటస్వామి సేవలను వివరించారు. ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, బెటాలియన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్యశిబిరం



మందులు అందజేస్తున్న ట్రస్ట్ బాధ్యులు

బోనకల్: బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం బత్తినేని చారిట్రబల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. బీపీ, మధుమేహంతో పాటు కంటి సంబంధిత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. క్యాంప్ నిర్వాహకులు యంగల ఆనందరావు, గిరి, కరుణాకర్, గొల్లపల్లి కృష్ణారావు తదితరులు

● వైరా: వైరాలోని నరేస్ ఆస్పత్రిలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హర్ష ఆధ్వర్యాన బీపీ, షుగర్, థైరాయిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

### ఎంబీబీఎస్ విద్యార్థినికి సన్మానం



శ్రీలేఖ, ఆమె తల్లిదండ్రులను సత్కరిస్తున్న సంఘం బాధ్యులు

ఎర్రుపాలెం: మండల కేంద్రానికి చెందిన గుమ్మడిరాజుల శ్రీలేఖ ఇటీవల నిర్వహించిన నీట్ కౌన్సెలింగ్‌లో ఉస్మానియా వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. పేదరికంలో జన్మించినా కష్టపడి చదివి ఎంబీబీఎస్ సీటు సాధించిన ఆమెతో పాటు తల్లిదండ్రులు పూర్ణచందర్ దంపతులను నవతరం సంఘం ఆధ్వర్యాన ఆదివారం మండల కేంద్రంలో సన్మానించారు. సంఘం బాధ్యులు కోట లోకేశ్వరరావు, గద్దల శ్రీనివాసరావు, సగ్గుర్తి ముత్యాలరావు, మోదుగ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న గ్రామస్తులు

ముదిగొండ: మండలంలోని బాణాపురానికి చెందిన మరికంటి నాగేశ్వరరావు ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబానికి గ్రామస్తులు ఆదివారం నగదు వితరణ చేశారు. నాగేశ్వరరావు భార్యకు రూ.20వేలు నగదు అందించారు. అలాగే, పిల్లల పేరిట రూ.67వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్ అందిస్తామని తెలిపారు.

# ఎలా ముందుకెళ్దాం?!

**పార్టీల్లో ఎన్నికలపై చర్చోపచర్చలు**

- రిజర్వేషన్ల ఆధారంగా అభ్యర్థుల ఎంపికకు సన్నాహాలు
- భవిష్యత్‌పై ఆశావహులకు భరోసా



సత్తుపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల వేడి ఇప్పుడిప్పుడే రాజుకుంటోంది. రిజర్వేషన్లు ఖరారు కావడంతో జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపిక కోసం కసరత్తు మొదలైంది. పార్టీ ఎన్నికల గుర్తుతో ఎన్నికలు జరగనుండగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. సత్తుపల్లి నియోజకవర్గంలో ఐదు జెడ్పీటీసీలు, ఎంపీపీ పదవులు రిజర్వ్ కావడంతో బలమైన సామాజికవర్గ నేతల్లో అసంతృప్తి ఉన్నా రాజకీయ అధికారం చేజారకుండా తమకు అనుకూలమైన అభ్యర్థులకే టికెట్ దక్కేలా నాయకత్వం వద్ద పావులు కదుపుతున్నారు. ఈసారి కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌తో పాటు బీజేపీ కూడా పార్టీ అభ్యర్థులను నిలబెట్టేందుకు కసరత్తు చేస్తోంది. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సొంత నియోజకవర్గం కావడం.. మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా ప్రత్యేక దృష్టి సారిస్తుండడంతో ఎన్నికలపై ఆసక్తి నెలకొంది.

**బీఆర్‌ఎస్‌లోనూ హడావుడి**

ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీ అధికార కాంగ్రెస్ పార్టీలో లొసుగులను తమకు అనుకూలంగా మార్చుకునేలా వ్యూహ, ప్రతివ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. ఈవిషయమై మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పార్టీలోని ముఖ్య నేతలతో సమాలోచనలు చేస్తూ ఇప్పటికే కల్లూరు మండల ముఖ్య నేతలతో భేటీ అయ్యారు. ఇక సోమవారం సత్తుపల్లి మండల బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం జరగనుంది. ప్రజల్లో ప్రభుత్వం వ్యతిరేకత ఉందని చెబుతూ పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం చేయాలని దిశానిర్దేశం చేస్తున్నారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ దెబ్బతిన్న గ్రామాలను పోలింగ్ బూత్‌ల వారీగా విశ్లేషించి.. పార్టీ కష్టకాలంలో నిలబడిన నాయకులు, కార్యకర్తలకు భవిష్యత్‌లో మంచి అవకాశాలు వస్తాయని చెబుతున్నారు.

**వేచి చూసే ధోరణిలో..**

ఓ పక్క వరుస సమావేశాలు నిర్వహిస్తున్నా ఎన్నికలపై అధికార, ప్రతిపక్ష పార్టీల్లో కొందరు నేతలు వేచి చూసే ధోరణి అవలంబిస్తున్నారు. ఈనెల 8న రిజర్వేషన్లపై హైకోర్టులో వాదనలు ఉన్నందున ఆ తర్వాత నిర్ణయం తీసుకుందామని ఆలోచన చేస్తున్నారు. ఎన్నికల్లో పోటీ ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో ఆచితూచి వ్యవహరించకపోతే ఆర్థికంగా నష్టపోయే ప్రమాదముందని భావనతో ఉన్నందునే గ్రామాల్లో ఇంకా పూర్తిస్థాయి రాజకీయ సందడి మొదలుకాలేదని తెలుస్తోంది. పాత రిజర్వేషన్లకు వైపే హైకోర్టు మొగ్గు చూపితే మళ్లీ అభ్యర్థుల ఎంపిక మొదటికి వస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఏది ఏమైనా ఎన్నికలు మాత్రం జరుగుతాయని దీనికి పార్టీలు సిద్ధంగా ఉండాలని ఒక అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం.

**అధికార పార్టీలో సందడి**

అధికార కాంగ్రెస్ పార్టీలో టికెట్ల కోసం గట్టి పోటీ నెలకొంది. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, దయానంద్ పార్టీ శ్రేణులతో చర్చలు జరుపుతున్నారు. ఇప్పటికే గ్రామాలు, మండలాల వారీగా కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించగా, జెడ్పీటీసీ, ఎంపీటీసీలతో పాటు సర్పంచ్ అభ్యర్థుల జాబితాపై అవగాహనకు వస్తున్నట్లు సమాచారం. ఇంకా మూడేళ్లు ప్రభుత్వం ఉంటుందని.. మరిన్ని అవకాశాలు వస్తాయని చెబుతూ ఆశావహులకు హామీ ఇస్తున్నట్లు తెలిసింది. పార్టీ అభ్యర్థుల విజయావకాశాలపై కూలంకుశంగా చర్చించి అవగాహనకు వచ్చినట్లు సమాచారం. బీసీలకు రిజర్వ్ అయినా చోట్ల బీసీల్లోని అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం వచ్చేలా కార్యాచరణ రూపొందించినట్లు తెలుస్తోంది.

# ఆశీర్వాదాలు.. పరామర్శలు

మధిర/వేంసూరు: మధిర మండలంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆత్కూరులో కంభంపాటి సురేష్ దంపతులను ఆయన ఆశీర్వదించారు. అలాగే, ఇల్లూరులో మాజీ సర్పంచ్ రామారావు కుమారుడి వివాహం ఇటీవల జరగగా నవదంపతులను ఆశీర్వదించి నూతన వస్త్రాలు అతర్వాత సైదల్లీపురంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వేమిరెడ్డి లక్ష్మారెడ్డి కుటుంబీకులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు నెల్లూరు పెద్ద పుల్లయ్యను పరామర్శించారు. డీసీసీబీ డైరెక్టర్ ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, నాయకులు డాక్టర్ రాంబాబు, సూరంశెట్టి కిషోర్, దేవిశెట్టి రంగారావు, యన్నం కోటేశ్వరరావు, అమరవాది సత్యనారాయణరెడ్డి, వేమిరెడ్డి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. అలాగే, వేంసూరు మండలం అడసర్లపాడుకు చెందిన మాజీ వైస్ ఎంపీపీ అట్లూరి సత్యనారాయణరెడ్డి నివాసంలో నిర్వహించిన చండీ హోమంలో మంత్రి పాల్గొన్నారు. అంతేకాక కుంచపర్తికి చెందిన కుక్కపల్లి రామకృష్ణ కుమారుడి వివాహం ఇటీవల జరగగా దంపతులను ఆశీర్వదించిన మంత్రి.. శంభునిగూడెంకు చెందిన అర్వపల్లి నరసింహారావు కుమారుడి రిసెప్షన్‌లో పాల్గొన్నారు. ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, నాయకులు దయానంద్, కాసరి చంద్రశేఖర్‌రెడ్డి, గడిపర్తి శ్రీనివాసరావు, పుచ్చకాయల కాంతరెడ్డి, అర్వపల్లి గోపాలరావు, కారుమంచి ప్రసాద్, బండి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఏన్కూరు: మండలంలోని నాచారంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తోట మాణిక్యమ్మ కుటుంబీకులను మంత్రి తుమ్మల నాగేశ్వరావు, వైరా ఎమ్మెల్యే మాళోతు రాందాస్‌నాయక్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఆదివారం పరామర్శించారు. నాయకులు తోట ప్రసాద్, తోట రాధాకృష్ణ, గిరిజ, జ్యోతి, శెట్టిపల్లి వెంకటేశ్వరావు, గుత్త వెంకటేశ్వరావు, స్వర్ణ నరేందర్, మేడ ధర్మారావు, వక్కంతుల నాగార్జున పాల్గొన్నారు.

బోనకల్: సీపీఎం మధిర డివిజన్ కమిటీ సభ్యుడు తెల్లాకుల శ్రీనివాసరావు తల్లి వెంకటనర్సమ్మ ఇటీవల మరణించగా ఆమె కుటుంబీకులను సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట పార్టీ డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాల్‌రావు ఉన్నారు.

## మెడికల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గం ఇదే..

ఏన్కూరు: మెడికల్ షాపుల అసోసియేషన్ మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా గుడ్ల వెంకటేశ్వరావు ఏకగ్రీవంగా ఎన్నికవగా, గౌరవ అధ్యక్షుడిగా బస్మాంగి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పాలెపు పాపారావు ఎన్నికయ్యారు. అలాగే, కోశాధికారిగా దొడ్డ శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా జువ్వాజి శ్రీనివాసరావు, కోపెల రామారావు, షేక్‌అన్వర్, షేక్‌హుస్సేనుద్దీన్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో బి.మోహన్, బి.శ్రీనివాసరావు, వంశీకృష్ణ, షేక్ పెంటు సాహెబ్, షేక్ జానీ, తుమ్మలపల్లి మధు, ఉపేందర్ పాల్గొన్నారు.

## రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

చింతకాని: మండలంలోని జగన్నాధపురం గ్రామ సమీపాన అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం పోలీసులు సీజ్ చేశారు. ముది గొండ మండలం పెద్ద మండవ మున్నేరు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఈమేరకు రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరేందర్ తెలిపారు.

## కాంగ్రెస్ హామీల విఫలంపై ప్రచారం చేయాలి



మాట్లాడుతున్న లింగాల కమల్‌రాజ్

ఎర్రుపాలెం: ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిన విషయాన్ని బీఆర్‌ఎస్ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ సూచించారు. మండలంలోని బనిగండ్లపాడులో ఆదివారం ఏర్పాటు చేసిన మండల స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికలకు శ్రేణులు సిద్ధం కావాలని తెలిపారు. గ్రామ స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసుకుని స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేయాలని సూచించారు. నాయకులు శేగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, యన్నం శ్రీనివాసరెడ్డి, శీలం కవిత, శీలం నారాయణరెడ్డి, సంక్రాంతి కృష్ణారావు, షేక్ హుస్సేన్, కాలసాని వెంకటనారయణ, శీలం కృష్ణారెడ్డి, కోట లోకేశ్వరరావు, యరమల కృష్ణారెడ్డి, శ్రీపాలశెట్టి తిరుపతిరావు, గద్దల శ్రీనివాసరావు, రాందేని వెంకయ్య, షేక్ బహదూర్‌ఖాన్, బొర్రా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## జీపీ కార్మికులకు అందని వేతనాలు

కల్లూరురూరల్: కల్లూరు మండలంలోని పేరువంచ, ముగ్గు వెంకటాపురం, కొర్లగూడెం, లింగాల, ఎర్రబోయినపల్లి, చిన్నకోరుకొండి, మర్లపాడు, లక్ష్మీపురం, తెలగవరం గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులు లేకపోవడంతో పాలన కుంటుపడింది. గ్రామపంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో గెజిటెడ్ స్థాయి అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించారు. వీరితో పాటు గ్రామ కార్యదర్శి సంతకంతోనే నిధులు డ్రా చేసే అవకాశముంటుంది. అయితే, 9 జీపీలకు స్పెషల్ ఆఫీసర్లు లేకపోవడంతో బ్లీచింగ్ పౌడర్, విద్యుత్ సామగ్రి కొనుగోళ్లు నిలిచిపోయాయి. అలాగే, రాష్ట్రప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులకు మూడు నెలల వేతనాలు మంజూరు చేసినా బ్యాంకు డ్రా చేయలేక సిబ్బంది వేతనాలు అందడం లేదు. ఈ విషయంలో ఉన్నతాధికారులు చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు.

# అమ్మవారి శోభాయాత్ర, నిమజ్జనం




సత్తుపల్లి టౌన్ : చండీహోమం నిర్వహిస్తున్న వేదపండితులు రవిశాస్త్రి

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి కల్పతరురోడ్డులోని శ్రీవిశ్వజ్ఞానపీఠం 8వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం వేద పండితులు రవిశాస్త్రి ఆధ్వర్యాన చండీహోమం నిర్వహించారు. తొలుత మేళతాళాల నడుమ చీర, సారె తీసుకొచ్చి శ్రీలలితాదేవి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో ఎస్.గణేష్‌రెడ్డి, ఎల్.విశ్వనాధరెడ్డి, కృష్ణార్జున్‌రావు, రాంబాబు, రమేష్, చింతకాయల దివ్య స్రవంతి, నాగేశ్వరరావు, డి.నారాయణ, ఎం.చంద్రశేఖర్, సీహెచ్.బ్రహ్మం పాల్గొన్నారు. కాగా, శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పూజలందుకున్న శ్రీలలితాదేవి అమ్మవారి విగ్రహాన్ని సత్తుపల్లిలో ఆదివారం సాయంత్రం శోభాయాత్ర నడుమ తీసుకెళ్లి తామరచెరువులో నిమజ్జనం చేశారు.

● చింతకాని: మండలంలోని పందిళ్లపల్లి, నాగులవంచల్లో దుర్గాదేవి నిమజ్జనోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశాక వాహనాల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి మున్నేటిలో నిమజ్జనం చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

● ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురంలో ఏర్పాటు చేసిన శ్రీదుర్గామాత ఉత్సవ విగ్రహం వద్ద కేఎస్‌ఆర్ గ్రానైట్ నిర్వాహకులు తుళ్లూరు కోటేశ్వరరావు – నిర్మలాకుమారి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అర్చకులు ఉప్పల చక్రధర్ ఆధ్వర్యాన పూజలు జరగగా, దుర్గామాత ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

● బోనకల్: బోనకల్‌లో దుర్గామాత శోభాయాత్ర ఆదివారం వైభవంగా సాగింది. జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు పూజలు చేయగా, బంజారా మహిళల నాట్యం, కోలాటాలతోయాత్ర ముందుకు సాగింది. అనంతరం అమ్మవారి ప్రతిమను కృష్ణానదిలో నిమజ్జనం చేసేలా విజయవాడ బయలుదేరారు. మాజీ జెడ్పీటీసీ బానోతు కొండ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చేబ్రోలు మల్లికార్జున్, పారా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



చింతకాని: దుర్గామాత విగ్రహం



ఎర్రుపాలెం: జమలాపురంలో పూజలు చేస్తున్న భక్తులు



బోనకల్‌లో..

## సీపీఎం అభ్యర్థుల గెలుపునకు కృషి చేయండి



వైరా : మాట్లాడుతున్న భూక్యా వీరభద్రం

వైరా: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్న సీపీఎం అభ్యర్థులను గెలిపించడానికి శ్రేణులు కృషి చేయాలని వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం పిలుపునిచ్చారు. వైరాలో ఆదివారం జరిగిన విప్పలమడక, లింగన్నపాలెం శాఖల సంయుక్త సమావేశానికి మాజీ సర్పంచ్ పారుపల్లి కృష్ణారావు అధ్యక్షత వహించగా వీరభద్రం మాట్లాడారు. ప్రజా సమస్యలపై నిత్యం పోరాడడమే కాక అందరికీ అందుబాటులో ఉండే సీపీఎం అభ్యర్థులను గెలిపించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కాగా, సీపీఎంతో కలిసొచ్చే పార్టీలతో సర్దుబాటు ఉంటుందని తెలిపారు. నాయకులు బాణాల శ్రీనివాసరావు, తోట నాగేశ్వరరావు, తూము సుధాకర్, బాజోజు రమణ, తుమ్మల జాన్ పాపయ్య, మేడా శరాబందీ, బాణాల కృష్ణమాచారి, మాజీ సర్పంచ్ బాణాల వెంకట్రావమ్మ, షేక్ జానీ పాల్గొన్నారు.

● సత్తుపల్లిరూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి సీపీఎం సిద్ధంగా ఉందని పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని సిద్ధారం గ్రామ శాఖ సమావేశం రేసు లక్ష్మి అధ్యక్షతన జరగగా ఆయన మాట్లాడారు. బీజేపీ మినహా కలిసి వచ్చే పార్టీలతో ఎన్నికల్లో అవగాహన ఉంటుందని.. లేని పక్షంలో ఒంటరిగానే జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాల్లో పోటీ చేస్తామని తెలిపారు. నాయకులు యాలగం రాములు, రేగుల గంగులు, మారుతి నారాయణ, రమాదేవి, తోటకూర నారాయణమ్మ, వాసం వెంకటరమణ, రాయిని ఆదినారాయణ, గురువింద రాజయ్య, జమ్ముల రాఘవులు, మంగమ్మ, తిరుపతమ్మ, సుధారాణి, చెన్నయ్య పాల్గొన్నారు.

## అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



సాయి కృష్ణమాచార్యులను సన్మానిస్తున్న నాయకులు

మధిర: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే ప్రతీ ఉద్యోగికి గుర్తింపు లభిస్తుందని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు తెలిపారు. మధిర మున్సిపాలిటీ పరిధి మడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన దీవి సాయి కృష్ణమాచార్యులను పీఆర్టీయూ ఆధ్వర్యాన సన్మానించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ సాయి కృష్ణమాచార్యులు 38ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో ఎందరినో తీర్చిదిద్దారని కొనియాడారు. సంఘం నాయకులు ఆర్.బ్రహ్మారెడ్డి సీహెచ్‌వీ.రవికుమార్, చిలుకూరి సత్యనారాయణరెడ్డి, పోలే సుధాకర్, డి.వెంకటేశ్వరరావు, షేక్ మదార్, కె.నారాయణదాసు, తోట నరసింహారావు, కె.ప్రమీల, బూసా కోటేశ్వరరావు, పురం సంగారావు, పిల్లి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడు?

- శాంతినగర్ – లాలాపురం మధ్య నిలిచిన బీటీ రోడ్డు నిర్మాణం
- రూ. 4.10కోట్ల నిధులతో పనులు ప్రారంభం
- ఏడాదిగా పూర్తికాక వాహనదారుల ఇక్కట్లు



అసంపూర్తిగా ఉన్న శాంతినగర్-లాలాపురం రహదారి

వైరా: రెండు గ్రామాలకు మధ్య లింక్ రోడ్డు.. ఏడాది క్రితం మొదలైన బీటీ రోడ్డు నిర్మాణం సగానికి పైగా పూర్తయింది.. సుమారు అర కిలోమీటర్ మేర నిర్మిస్తే పనులు పూర్తయ్యే అవకాశమున్నా అధికారుల పట్టింపు లేనితనంతో వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. వైరా మున్సిపాలిటీ పరిధి శాంతినగర్ నుండి కొణిజర్ల మండలం లాలాపురం వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు గత ఏడాది నవంబర్‌లో మొదలయ్యాయి. మళ్లీ నవంబర్ వస్తున్నా పూర్తికాకపోవడం అధికారుల పనితీరును తెలియచేస్తోంది.

**బీఆర్‌ఎస్ హయాంలో నిధులు**

శాంతినగర్ – లాలాపురం మధ్య రహదారి మెటల్ రోడ్డుగా ఉండడంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రూ.4.10 కోట్లు అంచనా వ్యయంతో రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ శంకుస్థాపన చేశారు. వైరాలోని శాంతినగర్ కేకే టవర్ నుండి అటు పల్లిపాడు, కొత్తగూడెం ప్రధాన రహదారిని కలుపుతూ సుమారు మూడు కి.మీ. మేర రహదారిలో సగానికి పైగా పూర్తయింది. అయితే వైరా రిజర్వాయర్ ఆనుకుని రోడ్డు నిర్మిస్తుండడం.. లాలాపురంలో వాగు కారణంగా వర్షాకాలంలో బీటీ రోడ్డు కొట్టుకోపోయే ప్రమాదముందని భావించారు. దీంతో అర కిలోమీటర్ మేర సీసీ రోడ్డు నిర్మించాలని అధికారులు భావిస్తే అంచనా పెరగడంతో కాంట్రాక్టర్ ఆరు నెలలుగా పనులు నిలిపివేశారు. ఈ విషయాన్ని అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు పట్టించుకోక నిర్మించిన రోడ్డు సైతం అక్కడక్కడా దెబ్బతింటోంది. ఇకనైనా పంచాయతీరాజ్ శాఖాధికారులు సమస్యను పరిష్కరించాలని లాలాపురం, శాంతినగర్ వాసులు కోరుతున్నారు.



వాగు సమీపాన డంప్ చేసిన పైపులు

**రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలి..**



లాలాపురం నుండి వైరాకు వెళ్లడానికి గత 40 ఏళ్లుగా ఇదే రోడ్డు ఉపయోగిస్తున్నాం. బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనందున అధికారులు చొరవ తీసుకుని త్వరగా పూర్తి చేయిస్తే మా ఇబ్బందులు తీరతాయి. అటు రైతులకు కూడా సౌకర్యవంతంగా ఉంటుంది.

– షేక్ సయ్యద్ పాషా, లాలాపురం

**ఏడాదిగా అసంపూర్తిగానే..**



వైరా నుండి లాలాపురం గ్రామానికి వచ్చివెళ్లే వారికి ఈ రోడ్డు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. సగం మేర చాన్నాళ్ల క్రితం పనులు పూర్తయ్యాయి. మిగతా పనులు కూడా పూర్తవుతాయని భావిస్తే అలా జరగడం లేదు. అధికారులు చొరవ తీసుకుని పూర్తి చేయించాలి.

– పఠాన్ మదార్, లాలాపురం

## అటెన్షన్ ప్లీజ్

### ఆదమరిస్తే అంతే...



కొణిజర్ల మండల కేంద్రంలోని రామాలయం ఎదురుగానే రోడ్డుపై భారీ గుంత పడింది. మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేశాక సక్రమంగా పూడ్చకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో పారిశుద్ధ్య కార్మికులు హెచ్చరికగా ఓ కర్ర ముక్క వేయడంతో మరింత ప్రమాదకరంగా మారినందున అధికారులు గుంత పూడ్చించాలని స్థానికులు కోరుతున్నారు. – కొణిజర్ల

ప్రశ్నించాల్సిన అధికారి : జి.రవి, పంచాయతీ కార్యదర్శి, సెల్ నంబర్ : 87906 75584

### ప్రమాదకరంగా రోడ్డు



తల్లాడ-లక్ష్మీనగర్ సమీపాన ఆర్ అండ్‌బీ రోడ్డుపై గుంత ఏర్పడింది. రోడ్డు చివరన్న ఉన్న ఈ గుంత రాత్రివేళ కనిపించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ ప్రాంతంలో ఇప్పటికే పలువురు గాయాల పాలయ్యారు. ఎదురుగా పెద్ద వాహనాలు వచ్చే సమయాన ద్విచక్రవాహనదారులు పక్కకు వెళ్తే ఈ గుంత వద్ద పడిపోతున్నారు. – తల్లాడ

ప్రశ్నించాల్సిన అధికారి : చేవెళ్ల నాగేశ్వర్‌రావు, ఆర్‌అండ్‌బీ జేఈ సెల్ నంబర్ : 93462 01908